# ఒంటికన్నువాడు

రమాపతి కారు బయటకు తీసి, కారు పక్కన ఠీవిగా నిలబడ్డాడు. పదిగంటలయింది. ఎండమండిపోతోంది. వేడి గాలి మట్టిని రేపుకుంటూ రివ్వున వీస్తోంది.

ఠీవిగా నిలబడి, తలపైకెత్తి, ఐదంతస్తులతో ఎత్తుగానే గాకుండా విశాలంగా వున్న ఇంటివేపు చూస్తున్నాడు.

అయిదో అంతస్తులోని కిటికీలోంచి భార్య చిరునవ్వులు విసిరేస్తూ, చెయ్యి వూపుతూ, అతడి చిరునవ్వుల మొహంలోకి చూస్తోంది.

పిల్లలు గబగబ మెట్లు దిగివచ్చి, వీధి గుమ్మం దగ్గర నిలబడి, చెయ్యి వూపుతూ, చిరునవ్వులు కురిపిస్తున్నారు.

రమాపతి కళ్ళల్లోనే గాకుండా, గుండెల్లో కూడా చిరునవ్వులు నింపేసుగుని, చెయ్యి వూపుతూ కార్లో కూర్చుని, కారు స్టార్టుచేసి, బయలు దేరేడు.

అతడు వూరికి ముప్పయి మైళ్ళ దూరంలో వున్న మామిడితోటలోకి వెళుతున్నాడు.

★ ★ ★

రమాపతి ఇంజినీరింగు కాలేజిలో అడుగుపెట్టాక సమాజం గురించి ఆలోచించడం ఆరంభించేడు. సమాజం గురించి ఆలోచన్లు రేకెత్తించే సాహిత్యం చదువుతున్నాడు. మానవతా దృక్పథం ఏర్పరచుగుంటున్నాడు. మానవతా విలువలు అలవర్చు గుంటున్నాడు. మానవతా వాదం వేపు నడక ప్రారంభించేడు.

అలా కొంతకాలం గడిచాక, ధనిక కుటుంబలో పుట్టి పెరిగిన రమాపతి, వాళ్ళ ధనార్జనలో ఏదో దగా వుందని చూస్తున్నాడు.

అలా నాలుగేళ్ళు గడిచిపోయాయి. డిగ్రీ తీసుగున్నాడు.

కాలేజి గోడలు దాటి బయటికి వచ్చేసాడు.

ఒంటరితనం – శూన్యత – అతణ్ని అశాంతికి గురిచేస్తున్నాయి. ఒకవేపు

- అందం పిలుస్తోంది! ఆస్తి పిలుస్తోంది! మరో వేపు - న్యాయం పిలుస్తోంది! నిజం పిలుస్తోంది! ఏ దారీ దొరకని వాళ్ళా - సతమతమవుతున్నాడు. సంఘర్షణ పడుతున్నాడు.

అయితే - సమాజం గురించి ఆలోచిస్తూ రమాపతి చెడిపోతున్నాడని రమాపతి తండ్రి చూసేడు. ఆ విషయం తన ఆప్తమిత్రుడే గాకుండా న్యాయవాది అయిన నారాయణరావుకి చెప్పేడు.

అలాంటి రోజుల్లో వో రోజున నారాయణరావు రమాపతిని ఇంటికి పిల్చేడు. రమాపతి వెళ్ళేడు. రమాపతిని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించేడు. కొంతసేపు నారాయణరావు వూసుపోక కబుర్లు చెప్పేడు. ఆ తర్వాత విస్కీతో - వేడి జీడిపప్పుతో - వేడి వేడి మాటల్లోకి చల్లచల్లగా దిగేడు.

'రమాపతీ! నువ్వు బాగుపడితే, ఆ బాగు సమాజానికే గాకుండా, దేశానికి కూడా ఎంతో బాగు అవుతుంది! వ్యక్తి అభివృద్ధి వల్లే సమాజం దోపిడీ నుంచి, దేశం దరిద్రం నుంచి విముక్తి పొందుతాయి! అలాంటి అనుభవం వల్లే - నేనూ మీ నాన్నగారూ - అలా ఎందరో మన కుటుంబాల్లో - ఆస్తి - అంతస్తు అంతే గాకుండా పేరూ - సంపాదించుకుని పెద్ద వాళ్ళే గాకుండా, గొప్పవాళ్ళయ్యారు! సమాజం గురించి మరోలా ఆలోచిస్తే, చెడిపోడవే గానీ బాగుపడడం జరగదు! నువ్వు బుద్ధిమంతుడువి! నిర్మాణాత్మకమైన ఆలోచనలు గలవాడివి! అందుకే నేను ఇదంతా నీకు చెబుతున్నాను! చెడిపోయేవాడికి నేనేమి చెప్పను గాక చెప్పను! అంతేగాకుండా - మరో విషయం! న్యాయానికి - అన్యాయానికి మధ్యనున్న గీత చాలా చాలా సన్నంగా వుంటుంది! తల వెంట్రుక కంటే సన్నంగా పలచగా వుంటుంది! ఆ గీత - ఎప్పుడు - ఎక్కడ - ఎలా గీయాలో తెలుసుగుంటే, ఏం జేసినా న్యాయవే అవుతుంది! న్యాయవాదిగా అనుభవంమీద చెబుతున్నాను! ఆ గీత నేర్చుగునే, ఎందరో కోటీశ్వర్లు అవడమే గాకుండా, సమాజ సేవకులుగా, దేశ సేవకులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుగున్నారు! ఇంజినీరింగు చదివిన నువ్వు ఆ గీత బాగా గీయగలవనే నమ్మకం నాకుంది! నువ్వు అలాంటి పెద్దవాడివే గాకుండా గొప్పవాడివి కావాలని నిన్ను ఆశీర్వదిస్తున్నాను! అంతే గాకుండా, మరోవిషయం! విస్కీ తాగనివాడు వెర్రివెధవేగానీ మేధావి కాజాలడని నాకు నమ్మకం వుంది!' - అని నారాయణరావు చెప్పి, రమాపతికి మరో గ్లాసు విస్కీ అందించేడు.

రమాపతి ఆ మాటలు విన్నాడు. విస్కీ - వేడి జీవిపప్పు - అంతేగాకుండా నారాయణరావు చల్లని వేడి వేడి మాటలూ - రమాపతిని కదిపి కుదిపేసాయి.

★ ★ ★

అలాంటి రమాపతి విస్కీకి బాగా అలవాటు పడిపోయాడు. నగ్న నృత్యాలు చేసే బారుకి వెళ్ళకుండా వుండలేకపోతున్నాడు. అమ్మాయిలు అందించే అందాలకు లొంగిపోయాడు. రమాపతి సుఖంగా బతకాలని నిశ్చయించుగున్నాడు. సుఖంగా బతకాలంటే, సుఖంగా డబ్బు సంపాదించాలని వెనువెంటనే తెలుసుగున్నాడు. ఎక్కడ చూసినా - అందం - అందం - అందం కనబడుతోంది గానీ అన్యాయం కనబడలేదు రమాపతికి!

★ ★ ★

అలాంటి రోజుల్లో వో రోజున రమాపతి - తండ్రిముందు తలవంచుకుని కూర్చున్నాడు.

'ఆ మధ్దిన నారాయణరావు గారింటికెళ్ళాను.' నెమ్మదిగా చెప్పేడు.

'ఎందుకు?! పిల్చాడా?!'

'అవును'

'విస్కీ ఇచ్చేడా?!'

'అవును'

'నారాయణరావుగారి అసలు పేరు నాణెం నారాయణరావు. నాణెం అంటే బంగారు నాణెమేగానీ సత్తు నాణెంకాదు! అతడు సుప్రసిద్ధ న్యాయవేత్త అవడం వల్ల కొందరతన్ని న్యాయం నారాయణరావని పిలుస్తూ వుంటారు! విస్కీ అతడి ప్రాణం కాబట్టి, కొందరతణ్ని విస్కీ నారాయణరావని పిలుస్తారు! నిర్మాణాత్మక శక్తి వున్న కొందరు యువకులికి అతడు గీత ఉపదేశిస్తూ వుంటాడు గాబట్టి కొందరతణ్ని గీత నారాయణరావని పిలుస్తారు! అతణ్ని అలా ఎన్నో పేర్లతో పిలుస్తూ వుంటారు! అయితే - నాకు మాత్రం, గీత నారాయణరావనే పేరే నచ్చుతుంది!' అని అతడు అయిదు నిముషాలు గంభీరంగా నవ్వేడు.

ఆ తర్వాత చెప్పడం ప్రారంభించేడు.

'పెద్ద చదువులు చదివినవాడు వుద్యోగం చేయాలని అనుకుంటాడు. అయితే – ఉద్యోగం చేసేవాడు బతగ్గలడు గానీ బాగుపడలేడు! మనకున్న పొలాలూ – మామిడి తోటలూ – నువ్వు చూసుకోగల్గితే చాలు, ఎన్నో వుద్యోగాల పెట్టు! అంతే గాకుండా, ఇంజినీరింగు డిగ్రీ వుంది గాబట్టి కాంట్రాక్టులు చేసుగుంటే, బాగా రాణిస్తుంది! ప్రభుత్వం ఖర్చుపెట్టే ప్రతి రూపాయిలో ముప్పయి పైసలు పనికి ఖర్చు అవుతుంది! మిగిలిన డబ్బయిపైసలు నువ్వూ – అవినీతిపరులైన అధికార్లూ పంచుగుంటారు! నా అనుభవాన్ని నీకు అందిస్తూ వుంటాను! మరో విషయం! నేను ఒక్కర్తే కూతురున్న మామగార్ని ఎంచుగున్నాను! నారాయణరావుకి 'గీత' అనే ఒక్కర్తేకూతురుంది! అతడు 'గీత'ను ఎంతగా ప్రేమిస్తాడు అంటే – కూతురికి కూడా 'గీత' అనే పేరు పెట్టగున్నాడు!' అని అతడు రమాపతికి అనుభవపూర్వకమైన మాటలు చెప్పేడు.

రమాపతి గీతను పెళ్ళిచేసుగున్నాడు. తండ్రి, అంతేగాకుండా, గీత నారాయణరావు చెప్పిన మార్గాల్లో డబ్బు సంపాదిస్తూ, సుఖమయ జీవితాన్ని వైభవంగా గడుపుతున్నాడు. వ్యక్తి అభివృద్ధి వల్లే సమాజం దోపిడీనుంచి, దేశం దరిద్రం నుంచి విముక్తి పొందుతాయని ఇప్పుడు రమాపతి అంటున్నాడు.

★ ★ ★

రమాపతి కారు జోరుగా నడుపుతున్నాడు.

ఒక విషాద దృశ్యం భయంకరంగా అతడి కళ్ళముందు కదుల్తోంది. పది రోజుల కిందట ఒక దుర్ఘటన జరిగింది. ఆ దృశ్యం సజీవంగా కళ్ళముందు అప్పుడే జరిగినట్లు కనబడుతోంది. కారు ఆపాడు. పెద్ద పెద్ద రక్తపుమరకలు కనబడుతున్నాయి. ఎర్రని ఎండలో ఆ రక్తపు మరకలు ఎర్రగా, భయంకరంగా కనబడుతున్నాయి.

ఆరోజు అతడు తోటనుంచి ఇంటికి వెళుతున్నాడు. మామిడిపళ్ల సప్లయికోసం అయిదులక్షల రూపాయల విలువ గల ఆర్డరివ్వడానికి కలకత్తానుంచి వ్యాపారస్తులు వచ్చారని తెలిసి, అతడు జోరుగా ఇంటికి వెళుతున్నాడు. కారు ఎంతో వేగంగా నడుపుతున్నాడు. ఎందురుగా ఎడ్లబండి వస్తోంది. కారుకి దారివ్వడం కోసం బండివాడు బండిని పక్కకు తోలేడు. ఆ ఎడ్లబండికి చాలా దగ్గరగా కారు దూసుకుపోడంవల్ల, ఎడ్లు బెదిరిపోయి రోడ్డు కిందికి పరుగెత్తాయి. బండి పక్కనున్న గోతిలోకి దొర్లిపడిపోయింది. మెళ్ళో పలుపు బిగుసుకుపోయి,

ఒక ఎద్దు వెంటనే చచ్చిపోయింది. బండిని నడుపుతున్న పదహారేళ్ళ కుర్రాడు, తూలిపోయి, రాళ్ళ మధ్య పడిపోయాడు. బండి అతడి మీద దొర్లిపడిపోయింది. అతడి ముక్కు నుంచి, నోటి నుంచి, శరీరం నుంచి, రక్తం ధారగా కారిపోతోంది. కాలు విరిగిపోయి, ఎముకలు పక్కకు వచ్చేశాయి. ఆ కుర్రాడు భీకరంగా కేకలు వేస్తూ, స్పృహ తప్పి పడిపోయాడు. ఆ కేకలు విని కొందరు పరుగు పరుగున వచ్చారు. అతణ్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

అయితే రమాపతి అంతా చూసి, ఏవీ చూడనట్లు, ఏవీ జరగనట్టు – జోరు జోరుగా వెళ్ళిపోయాడు. అయిదు లక్షల రూపాయలు విలువ గల ఆర్డరు కోసం, ఒక్కక్షణం కూడా ఆలస్యం కాకూడదని అతడు జోరు జోరుగా వెళ్ళిపోయాడు.

ఆ సజీవ దృశ్యం అతణ్ని నిలదీసి అడుగుతోంది. నువ్వ జీవితంలో అన్ని విలువలూ చంపేసుకుని జీవచ్ఛవంలా బతుకుతున్నావా?! – రమాపతి అలా ఎన్నోసార్లు తన్ను తాను ప్రశ్నించుకుంటున్నాడు. అతడి మనసు చెదిరిపోయింది. అతడి మనసు వికలమై పోయింది.

కారు మరో అయిదు మైళ్ళ దూరం వెళ్ళింది. రమాపతి కారుని ఎంతో వేగంగా నడుపుతున్నాడు. అంతలో హఠాత్తుగా కొన్ని వందల తేనెటీగలు గుంపులు గుంపులుగా కారులోకి దూసుకుని దూరిపోయాయి. అవి మొహం, కాళ్ళూ, చేతుల మీదా జోరు జోరుగా కుట్టేస్తున్నాయి. అతడు కంగారుపడుతూ గోల పెడుతున్నాడు. ఏమీ తోచని అయోమయ స్థితిలో స్టీరింగు స్వాధీనం తప్పిపోయి, కారు పక్కనున్న చెట్టును గుద్దుకుని ఆగిపోయింది. కారు అద్దం పగిలిపోయింది. అతడి నుదుటి మీద గాజు పెంకు గుచ్చుకుపోయి, నుదురు గాయపడింది. రక్తం కారిపోతోంది. అతడు కారులోంచి బయటకు అడుగు పెడుతున్నప్పుడు, స్పృహ తప్పి పడిపోయాడు.

అక్కడికి దగ్గరగా పన్నెండేళ్ళ కుర్రాడు మేకల్ని కాస్తున్నాడు. ఆ దుర్ఘటన చూసేడు. తాటికమ్మ మంటపెట్టి తేనెటీగల్ని తగిలేసాడు. చెవిలో వున్న పొగాకు చుట్ట విప్పి, ఒక ముక్క గాయపడిన చోట అంటించేడు. దగ్గరగా వున్న పత్తి మొక్క నుంచి పత్తి తెచ్చి గాయపడిన చోట అదిమి పెట్టాడు. తుప్ప నుండి ఆకులు తెచ్చి గాయం మీద వుంచాడు. ఆ కుర్రాడి వొంటి మీద గోచీ తప్ప ఏ గుడ్డముక్కా లేదు. గోచీ విప్పేసాడు. రెండు ముక్కలుగా చింపాడు. ఒక ముక్క మళ్ళీ గోచీ పెట్టుకున్నాడు. మిగిలిన ముక్కతో గాయానికి కట్టు కట్టాడు. గుడిసె

దగ్గరకు పరుగు పరుగున వెళ్ళి, మట్టి పిడతతో నీళ్ళు తెచ్చాడు. మొహం మీద నీళ్ళు జల్లాడు. కళ్ళలో చల్లని నీటి బిందువులు వేసాడు. నోరు విప్పి, నోట్లో చల్లని నీళ్లు పోసాడు.

పది నిమిషాలు పోయాక, రమాపతి కళ్ళు విప్పాడు. ఆ కుర్రాడి చేతులు పట్టుకుని లేచాడు. ఆ కుర్రాడు మౌనంగా నిలబడ్డాడు. ఏం జరిగిందో - ఆ కుర్రాడు ఏం జేసాడో - రమాపతి వివరంగా తెలుసుకున్నాడు. ఆ కుర్రాణ్ని ఎంతో మెచ్చుకున్నాడు. భుజం మీద చేయివేసి, తట్టి తట్టి, కృతజ్ఞత చెప్పుకున్నాడు. వొంటిమీద ఏ గుడ్డ ముక్కాలేని ఆ కుర్రాడు గోచీలో సగం ముక్క చింపి, కట్టు కట్టి ఆపదలో ఆదుకున్నందుకు ఎంతో ఆశ్చర్యపోయాడు - కాదు కాదు - మురిసిపోయాడు.

జేబులోంచి ఏభై రూపాయల కాగితం తీసి, ఆ కుర్రాణ్ని తీసుకోమన్నాడు.

'ఛీ! ఛీ! ఒద్దు!'

'ఎందుకొద్దు?!'

'ఒద్దు!'

ఆ కుర్రాడు మరింకేమీ మాట్లాడకుండా, కర్ర భుజాన్న వేసుకుని, వెళ్ళిపోయాడు.

ఛీ! ఛీ! ఒద్దు! - అన్న ఆ కుర్రాడి మాటలు - ఏ మహత్ గ్రంథమూ చెప్పలేనంత గొప్ప మాటలుగా, ఏ మహర్షులూ చెప్పలేనంత మంచి మాటలుగా ఆ క్షణంలో, ఆ సందర్భంలో రమాపతి భావించాడు.

ఎంతో ఉన్నత విలువలు పోషిస్తున్న ఆ గోచీ కుర్రాడు గొప్పవాడా?! ఏ విలువలూ లేని కొన్ని కోట్ల ఆస్తి ఉన్న నేను గొప్పవాడ్నా?! ఏ విలువలూ లేకుండా జీవచ్ఛవంలా నేను బతుకుతున్నానా?! అలాంటి ప్రశ్నలు ఆ క్షణంలో హఠాత్తుగా అతడి మనసులో అడుగుపెట్టి, గుండెల్ని మట్టేస్తూ తొక్కేస్తున్నాయి.

ఆ విషమ పరిస్థితిలో అతడు లోపలికి చేరుకున్నాడు. వాసపాకలోని మంచం మీద కూర్చున్నాడు. విస్కీబాటిలూ - జీడిపప్పు అందుకున్నాడు. అతడు తాగుతూ, గర్వంగా చిరునవ్వు నవ్వుకుంటున్నాడు.

భార్య చిరునవ్వుల్లోని మెరుపు, పిల్లల నవ్వుల వెన్నెల, అయిదంతస్తుల విశాల భవనం, - లక్షలు విలువ గల బంగారు నగలూ, కోట్ల విలువగల బూవులూ, తోటలూ, లక్షల విలువుగల చేతిలోని కంట్రాక్టులూ, వాటి, అంతేగాకుండా అలాంటి సుందర, సుఖమయ వైభవోపేత, రసమయ, చిత్ర విచిత్ర ఆహ్లాదకర దృశ్యాలు మనసులోని విషాద చిత్రాల్ని చెరిపివేస్తున్న -

ఆ క్షణంలో - వ్యక్తి అభివృద్ధి వల్లే సమాజం దోపిడీనుంచీ, దేశం దరిద్రం నుంచి విముక్తి పొందుతాయి గాబట్టి, అలాంటి విలువలు పోషిస్తున్న నేను గొప్పవాణ్నే గానీ, ఏ విలువలూ లేని అల్పజీవిని కాదు కాక కాదని రమాపతి నిబ్బరంగా, గర్వంగా అనుకుని, గర్వంగా నవ్వుకున్నాడు.

ఆరోజే అయిదు లారీల మామిడి పళ్ళు కలకత్తా పంపించాడు.

★ ★ ★

వ్యక్తి - సమాజం అనే రెండు కళ్ళు మనిషికి వుంటాయట. అయితే - సమాజం అనే కన్నుపోయిన ఒంటికన్ను వాడు రమాపతి!

★ ★ ★

(ప్రజాసాహితి - మాసపత్రిక - ఫిబ్రవరి - 1995)